

ఫిరంగిపురంలోని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య


విద్యుత్ దీపాలతో బాపట్ల పట్టణంలోని విద్యానగర్ ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి


బాపట్ల పట్టణంలో విద్యుత్ దీపాలతో అలంకరించిన సీబీజెడ్ చర్చి

..హ్యాపీ క్రిస్మస్

- అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభం
- బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ ప్రార్థనలు
- రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతోన్న చర్చిలు
- చర్చిల్లో కేకలు కట్ చేసి.. క్యాండిల్స్ వెలిగించి.. మిఠాయిల పంపిణీ

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు కాంతులీనుతుండగా.. నూతన వస్త్రాలు ధరించి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సందడి చేస్తుండగా.. క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పట్టణ, గ్రామాల కూడళ్లలో క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ క్రైస్తవులు ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చి ఉత్సవాలు జరుపుకున్నారు. హ్యాపీ క్రిస్మస్.. హ్యాపీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు బాణాసంచా కాల్చి.. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి క్రైస్తవులు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భారీ నక్షత్రాలు వీధుల్లో విద్యుత్ కాంతులతో వెలుగులీనాయి. అదే సమయంలో గుంటూరు మేత్రాసన బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ఫిరంగిపురంలోని ఆలయంలో అర్ధరాత్రి ప్రత్యేక పూజలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. లోక శాంతి, పాప పరిహారం, సర్వమానవాళి రక్షణ కోసమే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని తన సందేశంలో పేర్కొన్నారు. బాపట్లలోని క్రిస్టియన్‌పేట సాల్వేషన్ ఆర్మీ చర్చి, విద్యానగర్‌లోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి, సీబీజెడ్ చర్చి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లోని చర్చిలను క్రిస్మస్ వేడుకలకు సిద్ధం చేశారు. రేపల్లెలో బ్రిటీష్‌కాలంలో నిర్మితమైన లూథరన్ చర్చిలో వారం రోజులుగా జరుగుతున్న ప్రార్థనలు మంగళవారం కూడా కొనసాగాయి. ఇసుకపల్లిలోని ఇండియన్ రూరల్ ఇవాంజలికల్ చర్చితో పాటు చీరాల, అద్దంకి, పర్చూరు తదితర ప్రాంతాల్లోని చర్చిల్లో అర్ధరాత్రి ప్రార్థనలు జరిగాయి. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయా పూజల్లో గురువులు, పాస్టర్లు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రబోధించిన దయ, క్షమ, ప్రేమ, కరుణ, వంటి బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని సందేశమిచ్చారు.

ఆరుబయట పూజలకు వర్షం అడ్డంకి

క్రిస్మస్ సందర్భంగా ఏటా అర్ధరాత్రి జరిగే పూజలకు పెద్ద సంఖ్యలో భక్తు లు హాజరవుతారు. దీంతో చర్చిల్లో భక్తులు పట్టే అవకాశం ఉండదు. అందువల్ల అర్ధరాత్రి పూజలను ఆరుబయట నిర్వహించడం ఆనవాయితీ. అయితే పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి కూడా వర్షం కురవడంతో ఆరుబయట పూజలకు అడ్డంకిగా మారింది.


బాపట్ల : చిన్నారుల నృత్య ప్రదర్శన

వాయుగండం


నగరం మండలం ధూళిపూడి గ్రామంలో తడిచి ముద్దయిన ధాన్యాన్ని చూపెడుతున్న రైతు

- కోతకోయని చేలన్నీ నేల మట్టం
- పంటలపై వాయుగుండం ప్రభావం
- తడిచిన ధాన్యం.. పొలాల్లోనే ఓదెలు
- హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక
- వరుస తుఫాన్లతో బెంబేలెత్తుతున్న అన్నదాతలు

జిల్లా అంతటా జల్లులు

వరుస వాయుగుండాలు.. వణికిస్తున్నాయి. అన్నదాతలను వాయుగండాలు వీడటంలేదు. ధాన్యం చేతికొచ్చే డిసెంబరు నెలలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా మారి వర్షం దోబూచులాడుతూ వచ్చింది. సోమవారం ఆకాశం మేఘాలతో కమ్ముకున్నా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భరోసాతో కొందరు రైతులు కోతలు కోశారు. మరికొందరు యంత్రాల సాయంతో కోసి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. వాయుగుండం కారణంగా మంగళవారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజాము నుంచి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో పాటు చిరుజల్లుల నుంచి ఓ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. ఆరు గాలం శ్రమించిన పంట చేతికందేలోపు అకాల వర్షం నష్ట పరుస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా నూర్పిళ్లు జరగాల్సిన సమయంలో వర్షం అడ్డంకిగా మారింది.


రేపల్లె : జాతీయ రహదారిపై ఆరబెట్టుకున్న వరిధాన్యంపై పట్టాలు కప్పుకున్న రైతులు


బాపట్ల మండల పరిధిలోని నందిరాజుతోట హైవేపై ఆరబోసిన ధాన్యాన్ని బస్తాల్లోకి నింపుతున్న రైతులు


బాపట్ల : ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన అన్నదాతలు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచే చిరుజల్లులు కురవడంతో పాటు దట్టంగా ముసురు కమ్మేసింది. ఇదే తరహా పరిస్థితులు మరో మూడు రోజులు ఉండనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ వరకు కోతలు వద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నోటి దాక వచ్చిన పంట అకాల వర్షంతో అపార నష్టం జరుగుతుందని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజులుగా ముసురు కప్పేసి, అడపాదడపా వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో యంత్రాలతో కోతకోసి, ఆరబెట్టిన రైతులకూ నష్టం తప్పలేదు. పట్టాలు ఉన్న వారు ధాన్యంపై కప్పుకుంటున్నారు. అవి దొరకని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షంతో పంట నీట మునగడమే కాకుండా ఓదెలపై నీరు నిలిచి ధాన్యం కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలో కూడా మంగళవారం ముసురు పట్టి అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. డెల్టా ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చాలాప్రాంతాల్లో పైరు నేల వాలింది. వాయుగుండం కారణంగా యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లు, పొలాల్లో ఆరబెట్టగా వర్షానికి కొంతమేర తడిసిపోయింది. ఇప్పటికే పొలాల్లోని పనలు తడిసి మొలకలు రావడం, పైరు నేలవాలడం, ధాన్యం రంగుమారడం వంటివి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తేమ శాతం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకునే విషయంలో రైతుల కష్టాలు గడచిన నాలుగు వారాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. వర్ష హెచ్చరికల నేపథ్యంలో తడిగా ఉండగానే కుప్పలు వేస్తున్నారు. జల్లులకు తోడు ఎడతెగని ముసురు అన్నదాతలను భయపెడుతోంది. జల్లులతో అల్పపీడన ప్రభావం వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా రాబోయే రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షం పడినా పొలాల్లో నీళ్లు నిలబడతాయని, దీని వల్ల ధాన్యం రంగుమారడంతో పాటు దిగుబడుల్లో కూడా గణనీయంగా తేడా కనబడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. దిగుబడులు

(మిగతా 6వ పేజీలో)

డెల్టాను వీడని గండం

కృష్ణా పశ్చిమ డెల్టాపై వరుణుడి ప్రకోపం తగ్గలేదు. వరుస వాయుగుండాలతో గండం వెంటాడుతూనే ఉంది. డెల్టాలో 60 శాతం వరి కోతలు పూర్తయితే, 40 శాతం పైరు దశలోనే ఉంది. కోతలు ఇప్పటికే పూర్తి చేసినవారు గత వర్షాలకు నష్టపోయారు. మిగిలిన చేలల్లో పైరు నేలవాలి రంగుమారగా, ప్రస్తుత వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. డెల్టాలో 5.71 లక్షల ఎకరాలు సాగవుతుంటే, దానిలో బాపట్ల జిల్లాలో అత్యధికంగా 3,79,997 ఎకరాలు, గుంటూరు జిల్లా పరిధిలో 1,84,190 ఎకరాలు, ప్రకాశం జిల్లా పరిధిలో 7,164 ఎకరాలు ఉంది. వీటిలో గుంటూరు జిల్లా కిందున్న కాల్వల ఎగువ భూముల్లోని వరి పంట చాలావరకు గట్టెక్కింది. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర, పెదకాకాని, తెనాలి, పొన్నూరు మండలాల్లో చాలావరకు కోతలు చివరి దశలో ఉన్నాయి. ఇంకా పొన్నూరు మండలంలోనే కొంత ఎక్కువ కోత కొయ్యాల్సి ఉంది. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, అమృతలూరు, చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో చాలావరకు కోతలు పూర్తయ్యాయి. ఇక్కడ మొక్కజొన్న కూడా విత్తు నాటేశారు. రేపల్లె, పి.వి.పాలెం, నగరం, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, కాకుమాను తదితర మండలాల్లో కోతలు సగం పూర్తయ్యాయి. జంపని, మూల్పూరు, అమృతలూరు, చెరుకుపల్లి ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిచిపోయింది. రేపల్లె,నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో 10 వేల ఎకరాలపైనే పైరు కోయగా అదంగా పొలాల్లో ఓదెలుగా ఉంది. సోమవారం రాత్రి కురిసిన భారీవర్షంతో ఓదెలన్నీ తడిచి ముద్దయ్యాయి. బాపట్ల జిల్లాలో ఇప్పటికే దాదాపు 20,000 ఎకరాల్లో పైరు నేలవాలిందని, రంగు మారడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 3,000 ఎకరాల్లో కోతలు కోయగా పంట పొలం మీద ఉంది. ఈ జల్లులు ఇంతటి వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా వర్షం కొనసాగితే మునిగిపోతామని కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ...

అవగాహన అవసరం

- కారణాలు చూపకుండా తిరస్కరణతో పునరావృతం
- సదస్సులో కలెక్టర్ వెంకటమురళి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై అధికారులు అవగాహన కలిగిఉండాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అవగాహనకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని ఈసీ హాలులో అధికారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన అర్జీలు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చే అర్జీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తారన్నారు. జిల్లాలో 29 శాఖల ఫిర్యాదుల పరిష్కారాలకు సంబంధించి అధికారులకు లాగిన్స్‌కు అవకాశం ఉందన్నారు. జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తున్నారని, సరైన కారణాలు చూపకుండా తిరస్కరిస్తున్నారన్నారు. దీంతో అవి పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ఆడిటింగ్, పెండింగ్, ఫోన్‌కాల్స్ ప్రజల సంతృప్తి, అసంతృప్తిపై తీసుకోవాల్సిన చర్యలు గురించి పవర్‌ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార దిశలో జిల్లా మొదటి స్థానంలో ఉండేందుకు అధికారులందరూ చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. జిల్లాలో 33 శాఖలకు సంబంధించిన ప్రధాన పనితీరు సూచికలను సరిచేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కార స్వభావంపై కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పాగా

- వైసీపీ హయాంలోనే అసైన్డ్ భూమి కబ్జా
- చదును చేసి ఆక్రమణకు సిద్ధమైన భూబకాసురులు


అసైన్డ్‌భూమిలో ఇంటి నిర్మాణం, సాగులో ఉన్న పూలమొక్కలు

బాపట్ల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్‌నగర్ గ్రామశివారులో ప్రభుత్వ లేఅవుట్, అసైన్డ్‌భూములపై భూబకాసురులు కన్నేశారు. సర్వే నెంబరు 204, 207, 208లోని సుమారు 80 సెంట్ల అసైన్డ్‌భూమిని పేదలకు ఇచ్చేందుకు లేఅవుట్‌ను గతంలో ఏర్పాటు చేశారు. కొన్నినెలలు క్రితం వైసీపీ హయాంలోనే ఈ లేఅవుట్‌పై కొందరు భూబకాసురులు కన్నేశారు. ఆక్రమించాలని కొందరు ప్రయత్నించగా అప్పటి వీఆర్వో అడ్డగించి వారిపై కేసును నమోదు చేయించారు. అయితే మళ్లీ కొన్ని రోజులు క్రితం ఇదే లేఅవుట్‌ను కబ్జా చేయాలనే ఉద్దేశంతో ట్రాక్టర్ల ద్వారా చదును చేపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే సర్వే నెంబరు 204లో ఓ వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు 20సెంట్లకు పైగా ఆక్రమించి పూలమొక్కలు సాగు చేపట్టాడు. అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం మారినా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడంతో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. రోజురోజుకు అసైన్డ్‌భూమి లేఅవుట్‌లో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.



167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చండి

- కేసానుపల్లి, జొన్నలగడ్డ తదితర గ్రామాల రైతుల డిమాండ్
- జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు రహదారిపై రాస్తారోకో

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు హైవేపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. నకరికల్లు అడ్డరోడ్డు - చీరాల ఓడరేవు 167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సపాలెం, గుంట గార్లపాడు, రావిపాడుకు చెందిన రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంత మంది బడా నాయకులు, రాజకీయ నాయకులు భూములు కొనుగోలు చేశారని, వాళ్ళ స్వార్థం కోసం చిన్న, సన్నకారు రైతులను ఇబ్బంది పెడుతూ పాతఅలైన్‌మెంట్‌నే ఖాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన


రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ కే వేణుగోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు తదితరులు

గడ్కరి కమిటీ ఇక్కడి రైతులను సంప్రదించ కుండా మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కూర్చుని ఇప్పటికే ఉన్న అలైన్‌మెంట్‌నే ఖాయం చేశారని ఆరోపించారు. ఇక్కడ రెవెన్యూ డిపార్టుమెంట్ సహకరించకుండా, తెలియకుండా రాళ్ళు పాతడం, పోలీసులను అడ్డుపెట్టుకొని తమ భూములను కాపాడుకునే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై



జొన్నలగడ్డ వద్ద గుంటూరు-కర్నూలు హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇప్పటికే మంత్రి లోకేశ్‌ను కలిశామని, ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలవ నున్నట్లు చెప్పారు. రైతులకు హక్కులేదని అంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. 167ఏ హైవేకి మూడు అలైన్‌మెంట్‌లు సూచించారని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకి ఒక కిలోమీటరు దూరంలో 167ఏ హైవే ఏర్పాటు చేస్తున్నారని, పట్టణానికి ఇంతదగ్గరగా హైవే ఏర్పాటు ఎక్కడా లేదన్నారు. కష్టపడి సంపాదించుకున్న పొలాలు రోడ్డు కింద పోతే తమ భవిష్యత్ అంధ కారం అవుతుందన్నారు. ఇచ్చిన మూడు అలైన్ మెంట్‌లలో ఆప్షన్-1 లేదా ఆప్షన్-3 ఎంచు కోవాలన్నారని చెప్పారు. ఇప్పుడు వేసే 167ఏ రోడ్డు నాలుగేళ్ల తర్వాత పనికిరాదని, నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ఈ రోడ్డు వేస్తున్నారని రైతుల ఆరోపించారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. రాస్తారోకో చేస్తున్న రైతులతో తహసీల్దార్ కే వేణుగోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు చర్చలు జరిపి వారి ఆందోళ విరమింపజేశారు.

ధర్మం గెలిచింది... న్యాయపోరాటం ఫలించింది

- ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం
- ఎట్టకేలకు బీసీ ధ్రువీకరణపత్రం జారీ
- అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్‌కు, టీడీపీ నాయకులకు ఆమె ధన్యవాదాలు


నారా లోకేశ్‌తో షేక్ జబీన్ (ఫైల్)

దుగ్గిరాల, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) :'ధర్మం గెలిచింది... న్యాయం జరిగింది' అంటూ మూడేళ్ల నిరీ క్షణ అనంతరం బీసీ ధ్రువీ కరణ పత్రాన్ని పొందిన ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు బీసీగా అర్హత ఉన్నప్పటికీ రాజకీయకారణాలతో ధృవీ కరణ పత్రం అందక ఎంపీపీ పదవికి దూరంగా ఉన్న ఓ మహిళా ఎంపీటీసీ పోరాటం ఫలించింది. అన్యాయానికి, అధర్మానికి ఆయుష్షు తక్కువని రుజువు చేసింది. మండలపరిషత్ అధ్యక్ష పదవికి బీసీ వర్గానికి కేటాయించగా మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో పదిమంది టీడీపీ సభ్యులు, జనసేన సభ్యురాలితో మొత్తం 11 మంది సభ్యుల మద్దతు కలిగి కూటమిలో బీసీ సభ్యురాలు చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్ ఎంపీపీకి పదవి ఖరారైంది. ఈ నేపథ్యంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీ సాధిం చింది. అయినప్పటికీ చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్‌కు బీసీ ధృవీకరణ పత్రం అందకుండా చేశారని, మైనార్టీకి చెందిన మహిళ ఎంపీపీ పీఠం దక్కకుండా చేయాలని కుట్రపన్నుతున్నారంటూ టీడీపీ పలు రకాలుగా ఆందోళన చేపట్టినా ఫలితం లేకపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ధర్మ పోరాటం చేద్దామని, నాటి ప్రతిపక్ష నేత, నేటి విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మనోధైర్యంతో ముందుకు వెళ్లాలన్న సూచన మేరకు జబీన్ ముందుకు సాగింది. తక్షణమే సమస్యను విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని హైకోర్టు ఆదే శాలు వచ్చినప్పటికీ, కలెక్టర్ సైతం జబీన్ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో సంఖ్యా బలం లేనప్పటికీ అప్పటి అధికార వైసీపీకి చెందిన బీసీ మహిళను ఎంపీపీని చేశారు. అయినప్పటికీ పట్టువిడవకుండా మనోధైర్యం కోల్పోకుండా బీసీ ధృవీకరణ పత్రం కోసం ఎదురు చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చిన తర్వాత సెప్టెంబరులో జబీన్ మరోపర్యాయం బీసీ ధృవీకరణపత్రం కోసం తహసీల్దార్‌ను కలిశారు. బీసీ రిజర్వేషన్ రివిజన్ కమిటీకి వెళ్లాలని సూచించిన మీదట ప్రిన్సిపల్ సెక్రటరీ వద్దకు వెళ్లడం, డిసెంబరు 6న జిల్లా కలెక్టర్‌ను జబీన్ కలవడం జరిగింది. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ గ్రామంలో వారి బంధువులను విచారణ చేసిన తర్వాత సంబంధిత నివేదికను కలెక్టర్‌కు పంపారు. అంతిమంగా అన్ని అర్హతలూ కలిగిన జబీన్‌కు బీసీ-ఈ ధృవీకరణ పత్రాన్ని జారీ చేశారు. తనకు అండగా నిలిచిన నారా లోకేశ్‌కు, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక టీడీపీ నాయకులకు జబీన్ కృతజ్ఞతలు తెలిపారు.

నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టంలో తప్పుడు సమాచారం

- పల్నాడు ఎక్స్‌ప్రెస్ మంగళవారం రాత్రి గంటకు పైగా ఆలస్యం
- అయినప్పటికీ 15 నిమిషాలు ముందుగానే వచ్చినట్లు నమోదు

గుంటూరు, డిసెంబరు. 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారిక నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టం(ఎన్‌టీఈఎస్)లో అధికారులు తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. మంగళవారం నంబరు. 12748 వికారబాద్ - గుంటూరు పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ గంటకు పైగా ఆలస్యంగా గుంటూరుకు చేరుకుంది. అయితే, ఈ రైలు నిర్ణీత సమయం రాత్రి 9.05 కంటే 15 నిమిషాల ముందుగానే అంటే 8.50కే గుంటూరుకు చేరినట్లు నివేదించారు. దీనిపై రైలులో ప్రయాణించిన ప్యాసింజర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ అయి ఉండి గంటకు పైగా ఆలస్యంగా గమ్యస్థానానికి చేర్చినందుకు సిగ్గుపడాల్సిందిపోయి అందరిని తప్పుదోవ పట్టిస్తూ 15 నిమిషాలు ముందుగా చేరినట్లు నమోదు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు. దీనిపై బుధవారం రైల్వే జీఎం, డీఆర్ఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్ పై వేటు

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం, నిధుల దుర్వినియోగం తదితర ఆరోపణలపై నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విధుల నుంచి ఆయనను తప్పించింది. నాయక్ స్థానంలో ప్రస్తుత డీసీహెచ్ ఎస్ డాక్టర్ రంగారావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ హయాంలో ఆస్పత్రిలో బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్టు గుర్తించింది. దీంతో నాయక్‌పై చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

వీఆర్‌కు మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణ

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మెమో జారీ



మాచర్లటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చార్జ్‌మెమో జారీ చేశారు. గతంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం ఎస్ఐగా నారాయణ విధులు నిర్వహించారు. 2023వ సంవత్సరంలో కారు, బైకు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్ర వాహనచోదకుని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు రాజుపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న పుల్లారావు ఈ విషయ్నాన ఎస్ఐ నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడికి రూ. 3 లక్షలు ఇచ్చేలా పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్ చేశారు. అయితే, బాధితుడికి ఆ నగదు ఇవ్వలేదు. కాళ్లకు గాయం నయం కాకపోవడంతో బాధితుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో, బాధితుడు ఇటీవల ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు విచారణ జరపగా కారు, బైకు ఢీకొన్న సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తేలింది. దీనికి తోడు పోలీసుల సమక్షంలోనే సెటిల్‌మెంట్ జరగడం వంటి విషయాలను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్ఐ నారాయణకు చార్జ్‌మెమో జారీ చేసి వీఆర్‌కు పంపారు. ఇన్ చార్జి ఎస్ఐగా ఏఎస్ఐ రఫీ వ్యవహరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102,110,122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00

73,529 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,386 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 73,529 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,093 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500
నెంబరు. 5	9000	14000
273	8500	11700
341	8500	15000
4884	13500	13500
సూపర్ 10	10000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300
బ్యాడిగి	7500	13000
దేవనూరు డీలక్స్	9000	15000
తెల్లకాయలు	4000	11000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8000	15000
నెంబరు.5	8500	11800
273	10500	10500
341	8000	13000
4884	11000	12000
సూపర్ 10	15500	15500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7600	16500
బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	8500	13000
తెల్లకాయలు	4000	10500

గోవా-గుంటూరుకు ఎన్‌డీపీ మద్యం అక్రమ రవాణా

- గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- విక్రయిస్తూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుళ్లు, మరోవ్యక్తి
- పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు
- 133 మద్యం బాటిళ్లు స్వాధీనం


నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి, టూ టౌన్ సీఐ యశోదరదేవి, సిబ్బంది

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులే, ఆ అకృత్యానికి పాల్పడుతున్న వ్యక్తికి అండగా నిలిచారు. గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఆ వ్యక్తికి పోలీసులు సహకరిస్తున్నారు. ఎన్‌డీపీ మద్యం తీసుకొచ్చి ఒక పథకం ప్రకారం గుంటూరు పరిసర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, వీరి అక్రమ వ్యాపారం ఎన్నాళ్లో సాగలేదు. ఎక్సైజ్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సంఘటన గుంటూరులోని టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నాడు జరిగింది. ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి కథనం ప్రకారం వివరాలు, స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన ఘంటసాల బాజీ బాబు అలియాస్ బాబీ గత కొంతకాలంగా గోవా, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరు కేంద్రంగా విక్రయిస్తున్నాడు. ఈ అక్రమ వ్యాపారంలో పల్నాడు జిల్లా నరసరావుపేట అడ్మిన్ అదనపు ఎస్పీ ఆఫీసులో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గంధ శివకృష్ణ, నరసరావుపేటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విష్ణుములకల వాసుదేవరావు, నరసరావుపేట ఎస్‌బీ కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్ల ఆనందరావు, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన కుక్కమల్ల సురేష్. ఈ నలుగురు సిండికేట్‌గా మారి గుంటూరు పరిసర ప్రాంతాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారు. పాత కేసులో నిందితుడు, ప్రస్తుతం సబ్ జైల్‌లో ఉన్న బాజీబాబుకు స్నేహితులుగా మారి ఈ వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయమై గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ సీఐ యశోదర దేవి రాబటిటన సమా చారం మేరకు ఎస్ఐలను, సిబ్బందిని ప్రత్యేక ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. శివకృష్ణ, వాసుదేవరావు, ఆనందరావుల వద్ద 133 గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు అరుణ్ కుమారి తెలిపారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

జనవరి 30న విజ్ఞాన్ ఫార్మసీలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జనవరి 30 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు మంగళ వారం తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్, ఫ్యూచరిస్టిక్ అప్రోచ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ,శాంతి, సమభావనలకు ప్రతీక క్రిస్మస్

- ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ,శాంతి సమభావాలను కలిగి ఉండాలన్నదే క్రిస్మస్ పర్వదినం సందేశమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా వినుకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ పై ఆశలతో కొత్త సంకల్పాలతో కూడా రానున్న కొత్త ఏడాదిని స్వాగతించాలని కోరారు. రాష్ట్ర ప్రజలంత మనమంత ఒక కుటుంబమనే భావనతో శాంతి, సామరస్యాలతో కలిసి ఉండి ఒకొరికొకరు సహాయపడుతూ కలిసి పురోగమించాలని ఆకాంక్షించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్లరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 575.70 అడుగులు ఉంది. ఇది 270.87 టీఎం సీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8717 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20790 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 40,144 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,931 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ముగిసిన కౌన్సెలింగ్

- కార్పొరేషన్ 8, మున్సిపాల్టీల్లో 10 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్,కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం పదోన్నతుల కౌన్సిలింగ్‌ను డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసి స్టెంట్స్‌గా పదోన్నతులు కల్పించినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో తెలుగు -,3 ఇంగ్లీషు- 2, సోషల్ 1, హిందీ 2 చొప్పు మొత్తం మందికి పదోన్నతులు కల్పించారు. మున్సిపల్ పాఠశాలల పరి ధిలో ఇంగ్లీషు 1, ఫిజికల్ సైన్స్ 1, బయాలజీ 2, సోషల్ 4, లెక్కలు 2 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించినట్లు వెల్ల డించారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు జే రమేష్‌కుమార్, ఉర్దూ డీఐ ఎస్‌కె ఎండీ ఖాసిం, ఎంఈవో ఎండీ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.


పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామకపత్రం అందజేస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు


నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు

వాయు'గండం'

(5వ పేజీ తరువాయి)

అంతంతమాత్రంగా ఉన్న పరిస్థితుల్లో వరుస అల్పపీడనాలు తమను కుదేలు చేయడమే కాకుండా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా ఆరిపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడంలో ఆలస్యం కావడంతో గోతాలకెత్తి పట్టాలు కప్పిన బస్తాలు కూడా కింది నుంచి నీటి చెమ్మ చేరడంతో తడిచాయని రైతులు తెలిపారు. ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కి, రబీ కింద మొక్కజొన్న, మినుము విత్తనాలు ఈ రెండు రోజుల్లో వేసిన రైతులకూ నష్టం తప్పలేదు. వర్షంతో విత్తు కుళ్లిపోతోందని రైతుల ఆవేదన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటన రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని పొలాల్లో కోతలు కోసి వరి ఓదెల మీద ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కవారంరోజుల పాటు వర్షం పడకుండా ఉంటే రైతులు పూర్తిగా కోలుకుంటారని తెలుపుతున్నారు. పల్నాడు జిల్లాలో భారీ వర్షాలతో పత్తి పంట పూర్తిగా కుళ్లి నష్టపోయామని ధాన్యం కొంతమేర సంతృప్తి చెందుతుందనే దశలో అకాల వర్షం నష్ట పరుస్తుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నాలుగో రోజూ.. మూడో నంబరు హెచ్చరిక


నిజాంపట్నం హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద సూచిక ఎగురవేత

వాయుగుండం ప్రభావంతో నిజాంపట్నం హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. నాలుగు రోజుల క్రితం ఈ హెచ్చరికను ఎగురవేసినప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఎండ కూడా ఉండటంతో వాయుగుండం ఉండ దని అంతా భావించారు. అయితే వాతావరణ శాఖ ముందే హెచ్చరించినట్లు మంగళవారానికి వాతావరణంలో మార్పులు చోటు చేసు కున్నాయి. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలు ఒడ్డుకు చేరిపోయాచి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్న బోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

WANTED
శ్రీ గాయిత్రి మిల్క్ డెయిరి నందు పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు కావలెను
1. Operators : ITI Fitter / Elen
2. Lab Assts : B.Sc (Science)
3. Marketing executives: Degree
4. Helpers : 10th / Inter
Contact : C.E.O : 9154750090
Mail ID : ceo.gmdpl@gmail.com
Sri Gayatri Milk Dairy Pvt. Ltd.
Merikapoodi (V), Phiragipuram (M), Guntur (Dist)

పురపరిపాలన శాఖ
వినుకొండ పురపాలక సంఘం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
NIT.No. 822/2024/ఇ1 తేది : 24-12-2024.
(1) పని పేరు : వినుకొండ పురపాలక సంఘంనకు సంబంధించి 14 నెం.ల పనులకు సంబంధించి ఇ-ప్రోక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి. 14నెం.ల పనులకు సంబంధించి టెండరు స్వీకరణకు చివరి తేది / సమయం : 08.01.2025, సాయంత్రం 4.00 గం వరకు (3) సంబంధిత మునిసిపల్ కమీషనరు పేరు : శ్రీ యమ్. సుభాష్ చంద్రబోస్, కమీషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం. 08646-273656, మున్సిపల్ ఇంజనీరు, వారి సెల్‌నెం : 98661 82487 తదుపరి వివరములను http:/tender.apeprocurement.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.
సం/- కమీషనరు,
వినుకొండ పురపాలక సంఘం



ఉద్యోగావకాశాలు
→ విశ్రాంతి ఉద్యోగులకు శుభవార్త గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిపి పని చేయుటకు 10th పాస్, 40 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 94901 27118.
AJG-203289
→ గుంటూరు ఆటోనగర్‌లోని ప్రముఖ పెట్రోల్ బంకు నందు పార్ట్ టైమ్, ఫుల్ టైమ్ పంపు బాయ్స్ / గర్ల్స్ కావలెను. సంప్ర॥ 7799689889, 8074546302.
AJG-203749
→ ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ నందు వర్క్ చేయుటకు వివాహిత స్త్రీలు కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. విద్యార్హత:- ఇంటర్ పాస్, సంప్ర ✆ 91827 18626
AJB-1074

రియల్ ఎస్టేట్
బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్
→ మీ సొంత స్థలంలో మీకు నచ్చిన విధంగా చదరపు అడుగు రేటు ప్రకారం తీసుకొని పూర్తి కాంట్రాక్ట్ పద్ధతిలో గవర్నమెంట్ ఉద్యోగులకు మరియు ఐటీ వ్యాపారులకు అన్ని రకాల కన్‌స్ట్రక్షన్ చేయబడును. వివరాలకు గుంటూరు. సెల్ : 93907 05477.
RK-1298

PLOT FOR SALE
→ రాజధానికి 1 కిలో మీటర్ దూరంలో ఓపెన్ Plots కలవు. Sq.yd – రూ. 15,000/– మాత్రమే, సంప్ర॥ ఫోన్ : 86399 75344
AJO-365


పోయినవి
→ భట్టిప్రోలు మండలం, అద్దేపల్లి గ్రామ కాపురస్తులు కొలుసు వెంకట శివప్రసాద్ తండ్రి వీర రాఘవయ్య గారికి చెందిన దస్తావేజు నెంబరు 438/1974. భట్టిప్రోలు S.R.O లో రిజిస్టర్ కాబడిన సర్వే నంబర్ 350-3లో 0.54 సెంట్ల సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ జిరాక్స్ కోసం ఇంటి నుంచి భట్టిప్రోలు సెంటర్‌కు వెళుతుండగా మార్గమధ్యలో పోయినవి. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది 9391088744 కు తెలియపరచగలరు.
AJG-203817

అమ్మకము
→ గుంటూరు సిటీ, అంకిరెడ్డిపాలెం, NH-16 & ఇన్నర్ రింగ్‌రోడ్, జంక్షన్ హైవే గార్డెన్స్‌లో గ॥ం 16500, హౌసింగ్ బోర్డు ఎక్సటెన్షన్ కొత్తహౌస్ 50ల, అగతవర్పాడు 3 ఫ్లోర్స్ హౌస్ 75ల. సంప్ర॥ 99669 60009.
AJG-203700

అద్దెకు
→ Shop / Office 13/2 Arundalpet, Guntur, 2nd Floor, 500 Sft. Phone : 9849674315
AJH-1260

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్
గుంటూరు 1 టౌన్ - 97036 18725
గుంటూరు 2 టౌన్ - 99854 01056
తెనాలి - 99854 11202
నరసరావుపేట - 99854 11206
బాపట్ల - 99663 35084
పిడుగురాళ్ళ - 93909 05725
మంగళగిరి - 93986 73618
అమరావతి - 95027 86195
పొన్నూరు - 97042 99094
రేపల్లె - 99854 12254
చిలకలూరిపేట - 98852 71281
వినుకొండ - 99662 50266
మాచర్ల - 88861 19952
సత్తెనపల్లి - 91103 23914
ప్రత్తిపాడు - 63004 34285
సర్క్యులేషన్ మేనేజర్ :
99854 11214

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227
99854 02292

జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ క్రిస్మస్ శుభాకాంక్షలు

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలకు కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతిస్థాపన కొరకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతిదూత అని అన్నారు. క్రిస్మస్ పండుగ శుభసందర్భంగా అందరికి శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్పీ తుషార్‌డూడి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రార్ధన స్థలాల వద్ద, ముఖ్యమైన ప్రదేశాలలో పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి క్రైస్తవులు ప్రార్ధనమందిరాలకు వెళ్ళి ప్రార్ధనలో పాల్గొంటారన్నారు. దానికి తగిన విధంగా భద్రతపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రార్ధన మందిరాలు, చర్చిలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో పోలీసు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు అధికారులు సూచించే సూచనలకు అనుగుణంగా ప్రజలు సంతోషకరమైన వాతావరణంలో క్రిస్మస్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు.

డాక్టర్ గ్లోరియానేట్ క్రిస్మస్ శుభాకాంక్షలు

పిట్టలవానిపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను క్రైస్తవులతో పాటు మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకోవాలని పిట్టలవానిపాలెం టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షులు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి, ప్రేమ, దయ అహింస మార్గాన్ని ఏసుక్రీస్తు చూపారన్నారు. మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఈవోపీఆర్డీ ఎ.ఏలీషాబాబు, మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు-1, వివిధ పార్టీలకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, వైసీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మండల జనసేన అధ్యక్షుడు హుస్సేన్‌బేగ్‌లు మండల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

స్టూవర్టుపురంలో ఐదు ఎక్స్‌కవేటర్‌లు సీజ్

బాపట్ల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం బాపట్ల-చీరాల సరిహద్దు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైనింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టి ఐదు ఎక్స్‌కవేటర్‌లను సీజ్ చేసినట్లు బాపట్ల తహసీల్దార్ సలీమా తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్‌లను బయటకు తెచ్చే అవకాశం లేకపోవటంతో వాటి వద్ద వీఆర్వోలను ఉంచటం జరిగిందని చెప్పారు. అదేవిధంగా అక్రమ తవ్వకాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వెదుళ్ళపల్లి వీఆర్వో అబ్రహంను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నుంచి సస్పెండ్ చేయటం జరిగిందని తెలిపారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలి

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అమిత్‌షా క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమిత్‌షా వ్యాఖ్యలను సమర్ధిస్తారా అని ప్రశ్నించారు. విజయవాడలో ఎత్తైన అంబేద్కర్ విగ్రహం నిర్మించింది బడుగు, బలహీనవర్గాల కోసమైతే అమిత్‌షాను జగన్మోహనరెడ్డి ఎందుకు ప్రశ్నించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు డి.జగన్మోహనరావు, కె.కోటేశ్వరరావు, కె.మార్క్, డి.రాజారావు, టి.వెంకయ్య, డి.శ్రీనివాస్, బీసీనాయకులు మురళి శ్రీనివాస్, పాస్టర్ డి.డానియేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహమ్మద్ రఫీ, మోదుకూరి జాన్సన్‌కు ఘననివాళి

బాపట్ల డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ రఫీ విశ్వవిఖ్యాత గాయకుడని, తెలుగు నాటక రంగంలో సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించిన రచయిత మోదుకూరి జాన్సన్ అని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫి సంయుక్తంగా తెలిపారు. మంగళవారం మహమ్మద్ రఫీ శత జయంతి, మోదుకూరి జాన్సన్ 36వ వర్ధంతి కార్యక్రమంలో రచయిత డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహమ్మద్ రఫీ 26 భాషల్లో దాదాపు 7,500 పైచిలుకు పాటలు పాడారని, మోదుకూరి జాన్సన్ రచించిన నటనాలయం నాటకం నాటక రంగంలో ఒక కొత్త ప్రయోగమని అన్నారు. అనంతరం రచయితలు కస్తూరి శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ, బొడ్డపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు మహమ్మద్ రఫీ, మోదుకూరి జాన్సన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా శ్రీఅయ్యప్పస్వామి పడిపూజ

కర్లపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో 30వ రోజు అయ్యప్పస్వాములకు చద్ది కార్యక్రమాన్ని పాతకోట విష్ణువర్ధనరావు, సత్యవతి దంపతులు నిర్వహించారు. శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ముందుగా వినాయకుని, శివపార్వతులు, కుమారస్వామి, అయ్యప్పస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామికి పరిమి దత్తాత్రేయశర్మ అష్టోత్తర శతనామావాళి, అభిషేకాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాములు, భవానీలు, శివస్వాములకు విష్ణువర్ధనరావు, సత్యవతి దంపతులు చద్ది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమెత్స శ్రీనివాసరాజు, ఆట్ల వేణుమోహనరెడ్డి, పరిమి దత్తాత్రేయశర్మ, గాజుల శ్రీనివాసరావు, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, మెడతాటి గిరిధర్, నాయుడు వెంకటనారాయణ, పసుపులేటి కొండలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం



అమృతలూరులో విద్యుత్ కాంతుల్లో చర్చి



రేపల్లెలో బ్రిటిష్ కాలంలో నిర్మించిన లూథరన్ చర్చి



లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్, విద్యుత్ దీపాలు

రేపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రిటీష్‌కాలంలో నిర్మితమైన లూథరన్ చర్చి ఎంతో ప్రాచుర్యం కలది. వారం రోజులుగా క్రిస్మస్‌ను పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో ప్రార్ధనలు నిర్వహిస్తున్నారు. చర్చి చుట్టూ ప్రహరీకి విద్యుత్ దీపాల అలంకరణ చేశారు. భారీస్థాయిలో క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేయటంతో కాంతులు వెదజల్లుతున్నాయి. ఇసుకపల్లిలోని ఇండియన్ రూరల్ ఇవాంజలికల్ చర్చి(ఐఆర్‌ఈఎఫ్), 5వ వార్డులోని వలివలకొండ చర్చిలతోపాటు పట్టణం, మండలంలోని అన్ని క్రీస్తు దేవాలయాలను విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ సందర్భంగా ఫ్యాన్సీ దుకాణాలలో విక్రయానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టార్లు, డెకరేషన్ ఐటమ్స్ చూపరులను అబ్బురపరుస్తున్నాయి. క్రిస్మస్ వేడుకలకు చర్చిలను రంగురంగుల కాగితాలు, మిరిమెట్లు గొలిపే కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. చర్చిల ముందు క్రీస్తు రాకకు ప్రత్యేకంగా అలంకరించిన క్రిస్మస్ స్టార్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

కొల్లూరులో...



కొల్లూరులో విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్న పెద చర్చి

కొల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్ధనాలయాలను ముస్తాబు చేశారు. కొల్లూరుతో పాటు మండల పరిధి గ్రామాల్లో ప్రార్ధనాలయాలకు విద్యుత్ దీపాలను అలంకరించారు. చర్చిలలో క్రిస్మస్ ట్రీలను సుందరంగా ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాలను కమిటీ పెద్దలు పర్యవేక్షిస్తున్నారు.

అమృతలూరులో...

అమృతలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ వేడుకలకు పలు చర్చిలు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా పలు చర్చిలను విద్యుత్ కాంతులతో సుంద రంగా అలంకరించారు. క్రిస్మస్ రోజున ప్రత్యేక ప్రార్ధనల కోసం ఏర్పాట్లు చేశారు. మండల పరిధి మూల్పూరులోని తెలుగు బాప్టిస్టు చర్చి, లూథరన్ చర్చిలను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు.



క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న డాక్టర్ ఎస్.సాహిత్య తదితరులు

బాపట్లలో సెమీ క్రిస్మస్ సందడి

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సీబీజెడ్ చర్చి ఆధ్వర్యంలో ప్యాడిసన్‌పేటలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా డాక్టర్ ఎస్.సాహిత్య పాల్గొని క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. క్యాండీల్ లైటింగ్ వెలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీస్తుమార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. క్రీస్తు పుట్టుక నాటకం సభికులను అకట్టుకున్నది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్యాడిసన్‌పేట యూత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.పవిత్రకుమార్, ఎం.రాహుల్‌దేవ్, సంఘ సెక్రటరి జె.క్రిష్టాఫర్, ఎం.కవిత, సుధారాణి, సంఘపెద్దలు పాల్గొన్నారు.



జిల్లా కోర్టు ప్రాంగణంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా కోర్టు ప్రాంగణంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈవేడుకలకు ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.పవన్‌కుమార్‌లు పాల్గొనగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ సమాజ శాంతికి, మానవాళి సౌభ్రాతృత్వానికి క్రీస్తు బోధనలందరూ అనుసరించాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎన్.నరసింహారావు, బాషా, ఆర్.వెంకటేశ్వర్లు, ఎన్.సుబ్బారావు, కె.హరినాధ్‌రెడ్డి, వై.నరేష్‌బాబు, డి.శ్రీరామమూర్తి, సి.ప్రేమచంద్, సి.రవికుమార్, భీమా లీలాకృష్ణ, కె.అవినాష్, సీహెచ్ నాగయ్య, జి.నాగమోహిని, కె.రవిబాబు, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, బి.కమల్‌కుమార్, బి.స్టాలిని, సతీష్‌రాజా, బి.బెంజి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్

బాపట్లరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను గ్రామాలలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల తహసీల్దార్ సలీమా అన్నారు. బాపట్ల మండలం బేతపూడి గ్రామసచివాలయ పరిధిలో తహసీల్దార్ అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, వివిధ శాఖల అధికారులతో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. త్వరలో రీసర్వే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు. గ్రామాలలోని రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో అర్జీల రూపంలో సమర్పించి పరిష్కారం పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో బేతపూడి వీఆర్వో వలిబాబు పాల్గొన్నారు.

చర్చిలకు అరటి గెలలు పంపిణీ

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు మంగళవారం చర్చిలకు అరటి గెలలను అందజేశారు. ప్రజలంతా సంతోషంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గవిని కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన ఉండాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వినియోగదారుల హక్కులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. వినియోగదారులు, అమ్మకాలు, కొనుగోలులో ఇబ్బందులు తలెత్తినట్లైతే వినియోగదారుల ఫోరం ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రభుత్వం వినియోగదారుల శ్రేయస్సు కోసం న్యాయ స్థానాలలో వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కాలేజి, స్కూల్ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసపత్రాలు, మెమోంటోలు, నగదు బహుమతులను జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి విలియమ్స్, జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, బాపట్ల వినియోగదారుల సంఘం కార్యదర్శి పీసీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల వివరాలు పరిశీలించిన విజిలెన్స్ అధికారులు

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో రోడ్ల విస్తరణ సందర్భంగా ఇచ్చిన టీడీఆర్ బాండ్ల వివరాలను విజిలెన్స్ అధికారులు విచారించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం టీడీఆర్ బాండ్లకు సంబంధించిన స్థలాలను కొలిచారు. వాటి విలువ సమానంగా ఉందా లేదా అని తెలుసుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు విజిలెన్స్ అధికారులు ఈ విషయమై వచ్చి పరిశీలించటం చర్చనీయాంశంగా మారింది.

రైలు నిలుపుదలకు కృషి చేసిన సాంబశివరావుకు సత్కారం

వేమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేమూరులో డెల్టా రైలు నిలుపుదలకు కృషి చేసిన ప్రయాణికుడు తటవర్తి సాంబశివరావును సోమవారం రాత్రి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారంపై ప్రయాణికులు, ఆర్యవైశ్య సంఘీయులు సత్కరించి అభినందనలు తెలిపారు. మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకరరావు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి వేమూరు, పల్లెకోన స్టేషన్‌లో డెల్టా ఆగని కారణంగా ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. ఈ సందర్భంగా డెల్టా రైలు గార్డు, స్టేషన్ సిబ్బంది, డ్రైవర్లకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నంబూరు గాంధీ, తాళ్లూరు శ్రీనివాసరావు, గోనుగుంట్ల మురళి చంద్రశేఖరావు, గ్రామ పెద్దలు అన్నె శ్రీనివాసరావు, గుమ్మడి వీరబాబు, చంద్రశేఖరరావు పాల్గొన్నారు

బాపట్ల రూరల్ సీఐగా కె.శ్రీనివాసరావు

బాపట్ల రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాపట్ల రూరల్ సీఐగా కె.శ్రీనివాసరావు నియమించినట్లు అధికారులు తెలిపారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నెల్లూరులో బాధ్యతలు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా బాపట్ల రూరల్ సీఐగా వస్తున్నట్టు సమాచారం.

48 పశువుల షెడ్ల నిర్మాణం

కర్లపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 20 పంచాయతీలలో 48 పశువుల షెడ్‌ల నిర్మాణం చేపడుతున్నారని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలో నిర్మాణం జరుగుతున్న నాలుగు పశువుల షెడ్డులను మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలంలో 48 షెడ్డుల నిర్మాణం వివిధ దశలలో ఉన్నాయని చెప్పారు.

ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీ

చెరుకుపల్లి, డిసెంబరు 24 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆగస్టు నెలలో 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. దానికి సంబంధించిన ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ 2023-24వ సంవత్సరానికి పనులకు రూ.7,90,000 ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, ఎస్ఆర్‌పీ ఎ.చిరంజీవి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎ.మాలతి, డి.అరుణ, పీఆర్ ఏఈ ఫిరోజ్, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

వేమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చావలి గ్రామంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ బీసీ సంఘం నాయకులు అయినంపూడి శివలింగప్రసాద్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పేదలకు అన్నదానం నిర్వహించారు. అనాథ ఆశ్రమంలో ఉన్న 200 మంది పేదలు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు పట్టెల శివరామకృష్ణ, బొలగాని వాలేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారుల తీరుతో చిరువ్యాపారుల ఇక్కట్లు

● వరదల సమయంలో పాలు, బిస్కెట్ ప్యాకెట్‌ల పంపిణీ

● బిల్లులు చెల్లించటంలో అధికారుల జాప్యం

● కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు



పాలు, బిస్కెట్ ప్యాకెట్లను కవర్‌లలో ప్యాకింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది (ఫైల్)



వరద ప్రాంత ప్రజలకు పంపిణీ చేసేందుకు ఆటోలో లోడ్ చేస్తున్న చిత్రం (ఫైల్)

బాపట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరదల సమయంలో బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు భోజన ప్యాకెట్‌లతోపాటు పాలు, బిస్కెట్ ప్యాకెట్‌లు, వాటర్ బాటిల్స్ పెద్దఎత్తున తరలించారు. బాపట్ల నుంచి విజయవాడ వరద బాధితులకు సుమారు రూ.30 లక్షల విలువ చేసే వాటర్ బాటిల్స్ పంపించారు. అదేవిధంగా కొల్లూరు పరిసర ప్రాంత ప్రజలకు రూ.4,24,774 విలువ చేసే పాల ప్యాకెట్‌లు, బిస్కెట్ ప్యాకెట్‌లు పంపించారు. గడియార స్తంభం సెంటర్‌లోని చిరువ్యాపారుల దగ్గర పాలప్యాకెట్‌లు, బిస్కెట్ ప్యాకెట్‌లు తీసుకెళ్ళిన మున్సిపల్ అధికారులు నేటి వరకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరదల సమయంలో ఇక్కడ పనిచేసిన మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, డీఈ శ్రీనివాసరావు బదిలీపై వెళ్ళిపోయారు. నూతనంగా వచ్చిన కమిషనర్ జి.రఘునాధరెడ్డి, డీఈ కృష్ణారెడ్డిలు బిల్లులు గురించి తమకు తెలియదని చెప్పి వీరిని ఇబ్బంది పెడుతున్నారు. దీంతో వారు రోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. డెయిరీ నుంచి వచ్చిన ధరకే సేవాదృక్పథంతో తాము పాల ప్యాకెట్‌లు ఇచ్చామని, ఇప్పుడు బిల్లు చెల్లించకపోవటంతో సంబంధిత డెయిరీ వారు ఒత్తిడి తెస్తూ ఇబ్బంది పెడుతున్నారని అధికారులకు ఏకరువు పెట్టారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం స్పందించటంలేదు.

ఈవిషయమై కమిషనర్ జి.రఘునాధరెడ్డిని వివరణ కోరగా పాల ప్యాకెట్‌ల బిల్లుకు సంబంధించిన డీఈ నోట్‌ఫైల్ ఇవ్వనందున చెల్లించటం సాధ్యపడలేదని చెప్పారు. తెనాలి పురపాలక సంఘానికి బదిలీపై వెళ్ళిన డీఈ శ్రీనివాసరావును వివరణ కోరగా వాటర్ బాటిల్స్‌కు సంబంధించిన బిల్లు మాత్రమే తాను చూశానని పాల ప్యాకెట్‌లు, బిస్కెట్ ప్యాకెట్‌ల బిల్లులు తనకు సంబంధంలేదని చెప్పారు. రెవెన్యూ అధికారులు రూ.10 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారని వారిని అడగాలని చెప్పారు. రెవెన్యూ అధికారులను వివరణ కోరగా తాము అడ్వాన్స్ తీసుకున్న డబ్బులతో భోజనాలు పంపించామని చెప్పుకొచ్చారు. ఈ విషయమై ప్రస్తుత మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని వివరణ కోరగా బదిలీపై వెళ్ళిన డీఈ నోట్ ఫైల్ రాసి సంతకం పెడితే బిల్లు ఇవ్వవచ్చు అని చెప్పారు. అయితే దీనికి బదిలీపై వెళ్ళిన డీఈ అంగీకరించటంలేదు. ఈవిధంగా అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ చిరువ్యాపారులను నానా ఇబ్బందులు పెడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై స్పందించి బిల్లులు ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు. అంతంత మాత్రం వ్యాపారం చేసే తాము లక్షల రూపాయలు ఎక్కడ తెచ్చి కట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు

మంత్రి అనగానికి కృతజ్ఞతలు తెలిపిన పంతాని

రేపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఇటీవల నీటి సంఘాల ఎన్నికల్లో మోర్తోట డీసీగా ఎన్నికై కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటి ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన పంతాని మురళీధరరావు మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంతానిమురళీకి మంత్రి అనగాని శాలువా కప్పి అభినందించారు. మంత్రి అనగాని మాట్లాడుతూ తీరప్రాంతంలోని కృష్ణాపశ్చిమ డెల్టాలో సాగు, తాగునీటి కాల్వలు, డ్రెయిన్‌లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చివరి భూమి వరకు రైతులకు సాగునీరు అందించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, రేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, జనసేన పార్టీ సమన్వయ కర్త మత్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు అనగాని క్రిస్మస్ శుభాకాంక్షలు

రేపల్లె నియోజకవర్గంలోని క్రైస్తవులకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయన్నారు. క్రీస్తు బోధనలు పాటిస్తే సమాజం ఆనందదాయకంగా ఉంటుందన్నారు. క్రిస్మస్ పండుగ క్రైస్తవుల ఇంట వెలుగులు కావాలని, ఆ కుటుంబాలు సుఖసంతోషాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం పంపిణీ చేశారు. కొల్లూరుకు చెందిన ఇద్దరు మహిళలు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందారు. అనంతరం ఎమ్మెల్యేను కలిసి తమ ఆర్థిక పరిస్థితి వివరించి వైద్య ఖర్చులకు అయిన సొమ్మును ఇప్పించాలని కోరగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫారసు చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన నగదును గుత్తికొండ నవరత్నాంబ రూ.60 వేలు, తాడేపల్లి రాజ్యలక్ష్మి రూ.30,028 బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. తమకు ఆర్థిక సహకారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలు తీసుకుంటున్నారు.. రశీదు ఇవ్వడం లేదు

● గ్రామ సభలో ప్రశ్నిస్తున్న రైతులు

● సమాధానం ఇవ్వకుండా దాట వేస్తున్న అధికారులు



బూతుమల్లి రెవెన్యూ గ్రామసభలో అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ సుశీల


వేమూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సూచించిన మేరకు రెవెన్యూ గ్రామ సభలు జరగడం లేదు. ప్రధానంగా రైతులు సమర్పించిన అర్జీలకు ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదు. మరికొన్ని చోట్ల సమర్పించిన అర్జీలను తిరిగి రైతులకు ఇచ్చి సచివాలయంలో ఆన్‌లైన్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్న సందర్భాలు కూడా చోటు చేసుకున్నాయి. ఇదే పద్ధతి మంగళవారం మండలంలోని బూతుమల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో రైతులకు ఎదురైంది. ఇక్కడ 40 మంది రైతులు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. వారిలో ఏ ఒక్కరికి ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఇవ్వలేదు. ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఉంటే దాని ఆధారంగా తమ సమస్య పరిష్కారం కానప్పుడు స్థానిక అధికారులను కానీ, పైఅధికారులను కానీ ప్రశ్నించే అవకాశం ఉంటుందని, లేకపోతే తాము పెట్టుకున్న అర్జీ తమకు అందలేదని సమాధానం చెప్పే అవకాశాలు ఉంటాయని రైతులు వాపోతున్నారు. బూతుమల్లి సభలో మూడు సంవత్సరాల నుంచి తాసీలు కట్టించుకోవడం లేదని, ఆన్‌లైన్ విధానం వల్ల అనేకమంది రైతుల భూముల నెంబర్లు రిజిస్టర్ కాకుండా ఉన్నాయని వీటిపై అధికారులు వెంటనే స్పందించి సహకరించాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి, వీఆర్వో సీతయ్య, వేమూరి శేషుబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్ వివరణ...

తహసీల్దార్ సుశీలను వివరణ కోరగా తాము తీసుకున్న అర్జీలను సభ నిర్వహణ ప్రాంతంలోనే ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని సమాధానమిచ్చారు. 1430 ఫసలీ మాత్రమే ఆన్‌లైన్‌లో ఓపెన్ కావడం వల్ల 2022 సంవత్సరం వరకు భూమి శిస్తు బకాయిలు తీసుకుంటున్నామన్నారు. 1431, 1432 ఫసలీలు ఓపెన్ కాని కారణంగా తాసీలు వసూలు చేయలేకపోతున్నామన్నారు. సాంకేతికపరమైన సమస్యలు వల్ల కొన్ని భూములు వివరాల ఆన్‌లైన్‌లో రికార్డు కావడం లేదన్నారు. ఈ విషయాలపై అధికారులకు సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని ఆమె అన్నారు.

దేవాలయాల పరిరక్షణకు హైందవ శంఖారావం సభ

● శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామిజీ




సమావేశంలో మాట్లాడుతున్న శివస్వామిజీ

భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల పరిరక్షణ కోసం హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్లు శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామిజీ అన్నారు. భట్టిప్రోలులోని సాయికృష్ణ కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ జనవరి 5న గన్నవరం సమీపంలోని కీసరపల్లిలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హైందవ శంఖారావం సభ నిర్వహిస్తున్నారని, హిందువులందరూ లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కొల్లూరు మండలంలోని చినపులివర్రులో పాదయాత్ర నిర్వహించిసభ గురించి గ్రామస్తులకు వివరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు జె.హేమశంకరరావు, వి.శ్రీనివాసరావు, మురళీకృష్ణ, అరుణకుమారి, వెంకటేశ్వరరావు, శివగోపి, హిందూ చైతన్యవేదిక సభ్యులు రమణమూర్తి, జ్వాలా నరసింహం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


● చెరుకుపల్లి, డిసెంబరు 24 : విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సభ విజయవంతం చేయాలని శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామిస్వామీజీ అన్నారు. రాజవోలు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన సమావేశంలో శివస్వామి మాట్లాడుతూ కుల, వర్గ, రాజకీయాలకు అతీతంగా హిందూ సమాజం మొత్తం ఏకతాటిపైకి వచ్చి హిందూధర్మ పరిరక్షణ, దేవాలయాల పరిరక్షణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవాఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, పొన్నపల్లి సత్యనారాయణ, యెండూరి సూర్యనారాయణ, మధు, చింతల మురళీకృష్ణ, పడమటి వెంకటేశ్వరరావు రాష్ట్రీయ స్వయం సేవాక్ సంఘ జిల్లా కార్యదర్శి వరికూటి శివగోపి, హిందూ చైతన్యవేదిక సభ్యులు రమణమూర్తి, బండారు జ్వాలనరసింహం, హైందవశక్తి ప్రసాద్, తూనుగుంట్ల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

పండుగకు సర్వం సిద్ధం


తెనాలి ఐతానగర్ క్రీస్తు కృపాలయం



సత్తెనపల్లి పట్టణంలో చర్చి వద్ద అలంకరించిన క్రిస్మస్ ట్రీ


కాంతులీనుతున్న పాతపాటూరు క్రీస్తు శతవార్షిక లూథరన్ చర్చి

క్రిస్మస్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా అంతటా క్రిస్మస్ సందడి మంగళవారం రాత్రి నుంచే సంతరించుకుంది. ప్రధాన చర్చిలతో పాటు కాలనీల్లో, పల్లెల్లోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో చర్చిలు కాంతులీనుతున్నాయి. ఆయా చర్చిల్లో క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు మంగళవారం అర్ధరాత్రి అత్యద్భుతంగా జరిగాయి. చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. క్రీస్తు పుట్టుక నాటకం సభికులను ఆకట్టుకున్నది. క్రిస్మస్ స్టార్లు, ట్రీలు, వివిధ అలంకరణలతో చర్చి ప్రాంగణాలు మిరుమిట్లుగొల్పుతున్నాయి. క్రీస్తు ప్రభువు తమ ఇంట జన్మించాడని ప్రతీకగా నక్షత్రాన్ని ప్రతీ ఇంటిపైన, ప్రధాన కూడళ్లలో వేలాడదీశారు. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ టోపీలు, కోట్లు, క్రిస్మస్ ట్రీలకు అలంకరించే కానుకల బాక్సుల అమ్మకాలు ముమ్మరంగా జరిగాయి. ఇక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులంతా ఆనందంగా పండుగను జరుపు కోవాలని, అందరి గృహాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. బుధవారం జరిగే ప్రార్థనలకు పలు చర్చిల్లో ఏర్పాట్లు జరిగాయి.


విద్యుత్ దీపాలంకరణతో వెలుగులీనుతున్న తాడికొండలోని తెలుగు బాపిస్టు చర్చి


నరసరావుపేట రోడ్డు రహదారిపై విద్యుత్ కాంతులతో అలంకరించిన చర్చి


విద్యుత్ కాంతుల వెలుగుల్లో మెరిసిపోతున్న పెదనందిపాడు లూథరన్ చర్చి


నరసరావుపేటలోని విద్యుత్ దీపాలు అలంకరించిన హార్ట్ స్కూల్‌లోని చర్చి


విద్యుత్ కాంతుతో రెంటచింతల పట్టణంలో 1903లో నిర్మించిన లూథరన్ చర్చి

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై

దోబూచులాట

- గుంటూరు ఆర్‌డీవో పరిధిలో 66 షాపుల భర్తీకి నోటిఫికేషన్
- అందులో కనిపించని గుంటూరు వెస్టులోని ఖాళీలు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై రెవెన్యూ అధికారులు, దుకాణాదారులు దోబూచులాడు కుంటున్నారు. ఒక స్పష్టమైన విధానం అంటూ లేకుండా నోటిఫికేషన్లు జారీ చేయడం, ఆ తర్వాత నిలిపేయడం, మళ్లీ ఖాళీల భర్తీ అంటూ ప్రకటన ఇవ్వడం, వాటిల్లో కొన్ని షాపులను తొలగించడం చేస్తూ అయోమ యానికి గురి చేస్తున్నారు. దుకాణాల విభజన హేతుబద్ధం కాదంటూ కోర్టుల్లో కేసులు వేసిన వారివి కూడా ఖాళీల్లోకి తీసుకురాలేదు.

గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 66 రేషన్ డీలర్ల నియామకానికి ఆర్‌డీవో శ్రీనివాస రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి కలిగిన వారు జనవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నేరుగా/రిజిష్టర్ పోస్టు ద్వారా తమ కార్యాలయానికి అందేలా చూడాలన్నారు. 9వ తేదీ రాత పరీక్ష నిర్వహించి అదే రోజు ఒక్కో ఖాళీకి ఐదుగురిని ఎంపిక చేస్తారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో ఒక్కో దుకాణానికి ఒకరిని ఎంపిక చేస్తారు. అర్జీ నమూన సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచామన్నారు. అయితే ఈ ఖాళీలను ఎమ్మెల్యేలు ఎవరి పేర్లు అయితే సూచిస్తారో వారికే కేటాయిస్తారన్న విషయం బహిరంగ రహస్యమే.

గత కొన్నేళ్లలో కొంతమంది రేషన్‌డీలర్లు తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఒక్కో దుకాణంలో 800లకు పైగా రేషన్‌కార్డులు మంజూరు చేయించుకొన్నారు. మరోవైపు కొన్ని దుకాణాల్లో 400 కార్డులు కూడా లేని పరిస్థితి. వీటన్నింటిని సరి చేయాలంటే తొలుత రేషన్ షాపుల రేషనలైజేషన్ చేయాలి. అయితే దాని జోలికి పోకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ అధికారులు షాపుల విభజన చేపట్టారు. 800, అంతకంటే ఎక్కువ రేషన్ కార్డులు గుంటూరు నగర పరిధిలో ఏదైనా షాపులో ఉంటే 600లకు తగ్గించాలని ఆదేశించారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే షాపునకు 400 కార్డులకు పరిమితం చేయాలన్నారు. నగరంలో ఏ ఒక్క దుకాణంలోనైనా 799 కార్డులున్నా కదిలించొద్దన్నారు. దీనిపై పౌరసరఫరాల డీలర్లు అభ్యంతరం పెడుతూ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో గత రెండు నెలల నుంచి రేషన్ షాపుల విభజన ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా న్యాయ సలహా తీసు కొన్న రెవెన్యూ అధికారులు ఎవరైతే హైకోర్టుని ఆశ్రయించారో వారివి పక్కన పెట్టి మిగతా షాపుల విభజనకు పూనుకొన్నారు.

ప్రత్తిపాడు మండలంలోని పాతమల్లాయపాలెం, వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడులో 2, చమళ్లమూడి, గుంటూరు ఈస్టు (రూరల్)లో బుడంపాడు, ఏటుకూరు, గోరంట్లలో 4, నగరాలులో రెండు, జొన్నలగడ్డ, రెడ్డిపాలెంలో రెండు, గుంటూరు పశ్చిమ (రూరల్)లో అడవి తక్కెళ్లపాడులో 4, చల్లావారి పాలెంలో రెండు, చినపలకలూరు, చౌడవరంలో నాలుగు, లాలుపురం, నల్లపాడు, పెదపలకలూరు, వెంగళాయపాలెంలో మూడు, తుళ్లూరు మండలంలోని తుళ్లూరు, రాయపూడిలో రెండు, మందడం-2, హరిశ్చంద్రాపురం, బోరుపాలెం, దొండపాడు కలిపి ఒకటి, మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో ఆరు, గుంటూరు పశ్చిమ మండలంలోని స్వర్ణభారతీనగర్, గుంటూరు ఈస్టులోని ఎల్ఆర్ కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, ఇందిరాకాలనీ, సీతానగర్, శ్రీనగర్, మంగళదాసునగర్, నల్లచెరువు, చాకలిగుంట, ఏటుకూరు రోడ్డు, సూరానగర్, అలీనగర్, ఆనందపేట, బాలాజీనగర్, ఏకావారివీధి, బుచ్చయ్యతోట, పాదర్తి వారి వీధి చక్కల బజారు, మంత్రివారి వీధి, క్రిష్టియన్‌పేట రెడ్లబజారు, యాదవబజారు యాదవహైస్కూల్ లక్ష్మీనగర్, ఆర్‌టీసీ కాలనీ మణిపురం, నల్లచెరువు, నందివెలుగురోడ్డు ఆర్‌టీసీ కాలనీ, రామిరెడ్డి తోట, డొంకరోడ్డు మల్లికార్జునపేటలోని రేషన్ దుకాణాలను ఖాళీగా చూపించి డీలర్ల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నగర పరిధిలో ఒక్క రేషన్ దుకాణం కూడా చూపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై తాము హైకోర్టుని ఆశ్రయిస్తామని డీలర్ల సంఘం నాయకులు తెలిపారు.

గుంటూరు - నడికుడి సెక్షన్‌లో పెరిగిన రైళ్ల క్రాసింగ్‌లు

- ప్యాసింజర్ రైళ్ల సమయ పాలనపై ప్రభావం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లలో రైళ్ల సంఖ్య పెరగడంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో క్రాసింగ్‌ల సంఖ్య పెరిగిపోయింది. ఒకప్పుడు ఈ సెక్షన్‌లో ఒకటి, రెండు రైళ్లు మాత్రమే ప్యాసింజర్‌లకు ఎదురయ్యేవి. నేడు సూపర్‌ఫాస్టు, వందేభారత్ రైళ్ల క్రాసింగ్‌లు ఉండటంతో నిబంధనల ప్రకారం ప్యాసింజర్ రైళ్లని ఏదైనా స్టేషన్‌లో లూప్‌లైన్‌లో పెట్టక తప్పని పరిస్థితి. దీంతో ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ పెంచు కుంటూ పోంది. ప్రధానంగా గుంటూరు - మాచర్ల, మాచర్ల - గుంటూరు మధ్యన ప్రయాణించే రైళ్లపై సమయపాలన ప్రభావం పడుతున్నది. దీంతో రైలు ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం గుంటూరు - మాచర్ల మధ్యన రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిల్లో మొదటి రైలు నంబరు. 07779 గుంటూరు - మాచర్ల ప్యాసింజర్ ఉదయం 8 గంటలకు బయలుదేరి 11.40కి మాచర్లకు చేరుకొంటుంది. గతంలో ఈ రైలుకు కేవం మాచర్ల - భీమవరం ప్యాసింజర్ రైలుతో మాత్రమే క్రాసింగ్ ఉండేది. అలాంటి నేడు ఎల్‌టీటీ, విజయవాడ, ఇంటర్‌సిటీ, వందేభారత్, జన్మభూమి, భావనగర్ రైళ్లతో క్రాసింగ్ ఉన్నది. దీని వలన గమ్యస్థానానికి చేరుకోవడం ఆలస్యం అవుతుండటంతో జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న టైంటేబుల్‌లో 30 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించారు. దీని వలన ఈ రైలు మధ్యాహ్నం 12.10కి మాచర్ల చేరుతుంది. అలానే నంబరు. 07781 విజయవాడ - మాచర్ల ప్యాసింజర్ ప్రస్తుతం సాయంత్రం 5.45కి గుంటూరులో బయలుదేరి రాత్రి 9.35కి మాచర్లకు చేరుకొంటున్నది. ఈ రైలుకి మాచర్ల - గుంటూరు, ఫలక్‌నుమా, పల్నాడు, సిల్బార్, విశాఖ, చెన్నై, ఇంటర్‌సిటీ రైళ్ల క్రాసింగ్ ఉన్న కారణంగా దీని ప్రయాణ సమయాన్ని 35 నిమిషాలకు పెంచారు. ఈ కారణంగా ఈ రైలు కొత్త సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి రాత్రి 10.10కి మాచర్ల చేరుకొంటుంది.

ఇదేవిధంగా నంబరు. 07782 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు నిత్యం వేకువజామున 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుతున్నది. ఈ రైలుకు ఫలక్‌నుమా, పల్నాడు, శబరి, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. అయితే ఈ రైలు ప్రయాణ సమయాన్ని కొత్త సంవత్సరంలో పెంచకుండా ఇంకా 30 నిమిషాలు తగ్గించారు. మరోవైపు నంబరు. 07780 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రస్తుతం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 7.45కి గుంటూరుకు చేరుకొంటుంది. ఈ రైలుకు గుంటూరు - నడికుడి సెక్షన్‌లో ఇంటర్‌సిటీ, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. దీని వలన కొన్ని సందర్భాల్లో వందేభారత్ రైలు కూడా క్రాసింగ్ అవుతున్నది. అలానే వెనకగా వచ్చే ఫలక్‌నుమా, పల్నాడుకు కూడా ప్రిసిడెన్స్ పడుతున్నది. ఈ నేపథ్యంలో రైలు ప్రయాణ సమయాన్ని 15 నిమిషాలు పెంచి రాత్రి 8 గంటలకు వచ్చేలా టైంటేబుల్‌ని జనవరి 1వ తేదీ నుంచి సవరించారు.

ఫెడరేషన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కర్, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. షేక్ సాదియా అల్‌మాస్ జూనియర్స్ స్క్వాట్ 57 కిలోల విభాగంలో 200 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, బెంచిప్రెస్‌లో 97.5 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 185 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, మొత్తంగా 482.5 కిలోల బరువును ఎత్తి జూనియర్ నేషనల్ రికార్డు సాధించడంతోపాటు బెస్ట్ లిఫ్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బొల్లినేని చంద్రిక సీనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో స్క్వాట్‌లో 240 కిలోల బరువును ఎత్తి రజతం, బెంచిప్రెస్‌లో వంద కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 210 కిలోలతో స్వర్ణం, మొత్తంగా 550 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకం సాధించింది. షేక్ షబీనా 84 కిలోలు పైబడిన విభాగంలో డెడ్‌లిఫ్ట్‌లో తృతీయ స్థానం, ఓవరాల్‌గా ఐదవ స్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన లిఫ్టర్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ అభినందించారు.


పతకాలు సాధించిన షబీనా, చంద్రిక, సాదియా

ప్రజలకు సౌకర్యంగా అండర్ పాస్‌లు

- ప్రజాధనం, సమయం వృథా చేసిన వ్యక్తి జగన్
- విజన్ ఉన్న నేత చంద్రబాబునాయుడు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు పరిశీలన

తుళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యంగా ఉండేలా బైపాస్ రోడ్డు నిర్మాణంలో అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజధాని ప్రాంతం మీదుగా వెళ్తున్న విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం ప్రతి రెండు కిలో మీటర్లకు అండర్ పాస్ మార్గాలను వేయాల్సి ఉండగా, రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యం కోసం ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండేలా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ అనుమతులు ఇచ్చింద న్నారు. అంతేకాకుండా అంతర్గత రహదారులకు కనెక్టివిటీ బాగుండే విధంగా ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండాలని నిర్ణయించిందన్నారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా అనుమతులను తుంగలో తొక్కి, పాత నిబంధనను కొనసాగించమని అధికారులను ఆదేశించారని తెలిపారు. పరిపాలనపై అవగాహన, దూరదృష్టి లేని వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. బైపాస్ పనులకు సంబంధించిన ప్రజాధనం రూ. 400 కోట్లు, విలువైన సమయం వృథా అయ్యిందనటానికి నిదర్శనం ఆయన తీసుకున్న నిర్ణయాలేనన్నారు. వాస్తవానికి ఏప్రిల్‌కి బైపాస్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వ నిర్ణయాల వలన మరో ఏడాదిన్న వరకు ఆలస్యం అవుతుందన్నారు. ఏదైన చిన్న చిన్న సమస్యలు ఉన్నా సరే అధికారులతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామ న్నారు. చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఏ ఒక్క రైతుకి, ప్రజలకు అన్యాయం జరగే సమస్య లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం అధికారులు ఇచ్చే ప్రపోజల్స్ ప్రకారం 10 అండర్ పాస్‌లు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జీ.ఎస్.సాయి ప్రవీణ్ చంద్, ఎస్‌హెచ్‌పీడీ పార్వతీశం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈ ప్రభాకర్, టీడీపీ నేతలు పట్టాభిరామయ్య, బెల్లంకొండ నరసింహారావు, జమ్ముల అనిల్, నవయుగ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, మేనేజర్ రామకృష్ణ, అదాని సంస్థ తరపున పీడీ శ్రీరామ్ మూర్తి, బసవేశ్వరరావు పాల్గొన్నారు.


విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

కర్ణాటక-ఉత్తరాఖండ్ మ్యాచ్ డ్రా


సుకృత్ (74 పరుగులు) ధ్రువ్ (54 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ అండర్-16 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 146.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 445 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఓవర్‌నైట్ స్కోరు 112/3 పరుగులతో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 66 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆఖరి రోజు మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కర్ణాటక బ్యాటర్లు జే.సుకృత్ 74 (నాటౌట్), ధృవ్ కృష్ణన్ 54 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ ప్రియాన్షు సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఉపాధి కూలీలకు తీపి కబురు



- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలకు ఎన్డీయే ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల కనీస వేనాన్ని రూ 263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళ్లల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది.

సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పని చేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్టర్లు తనిఖీ చేయాలి. ఈ తరహా చర్యలతో కూలీలకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాల పై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట..

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్టర్ల బోగోతం నడుస్తుంది. కూలీలు పనికి రాక పోయినా హాజరైనట్లు కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. వేతన దినాలు దుర్వినియోగం కావటంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందటం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో పర్యవేక్షించే జిల్లా విజిలెన్స్ అధికారి సమన్వయంచేస్తారు.


ఉపాధి హామి పనులు చేస్తున్న కూలీలు



నిబంధనలు ఇవే...

ఉపాధి కూలీలకు కనీస వేతనం పెరగటానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. నిధానంగా పనుల గుర్తింపు పని ప్రదేశానికి అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం, కూలీలు పని చేయటానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకొని పనులు కల్పించాలి. పని వేళల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్టర్లు తనిఖీ చేయాలి. కూలీలు చేసే పని వేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాల రసీదులు కచ్చితంగా ఇవ్వాలి.

లక్ష్యానికి అనుగుణంగా పని వేళలు



జాబ్ కార్డు ఉన్న వారందరికీ దినసరి వేతనం రూ 300 అందేలా చూస్తాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి కూలీల పని వేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పని చేసే కూలీలు ఐదు గంటల పాటు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపు పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లో 1,73,549 కూలీలు నమోదయ్యారు. 99,924 మంది ఉపాధి హామి పథకంలో పనులు చేస్తున్నారు. - నారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి